క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుపరచాలని మహిళల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం మహిళలు వినతిపత్రం అందజేశారు. షిర్డీనగర్‌కు చెందిన మహిళలు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ సూర్యప్రకాశరావు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో దోమల బెడద ఎక్కువగా ఉందని అనారోగ్యంపాలై పరిస్థితి నెలకొందన్నారు. రహదారులపై చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని వాపోయారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె. ఇందిరా ప్రియదర్శిని, ఎం.సూర్యకుమారి, కె.పద్మజ, శ్రీదేవి, లక్ష్మీప్రసన్న, భవానీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తొండంగి: మండలంలోని గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బెండపూడి ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెండపూడి 11 కేవీ విద్యుత్ ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ మరమ్మతుల కారణంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. గృహ, చిన్నతరహా పరిశ్రమ, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సుప్రీం కోర్టు సీజేఐపై దాడి దుర్మార్గం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

ఏలేశ్వరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి నిరసనగా పట్టణంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. దేశ అత్యున్నత న్యాయమూర్తిపై జరిగిన దాడిని రాజ్యాంగంపై దాడిగా పరిగణించాలన్నారు. న్యాయమూర్తి దళితుడు కావడంతో తట్టుకోలేని కొన్నివర్గాలు దాడికి పూనుకున్నాయన్నారు. అనంతరం దోషులను కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ కుశరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు, వంగలపూడి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ తనిఖీలు



శంఖవరం కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్

శంఖవరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డిప్యూటి కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. హాస్టల్ పరిసరాలను, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై సిబ్బందిని ఆరా తీసి తనిఖీలు చేశారు.

కేజీబీవీ కేంద్రంలో ..

తొండంగి: మండలంలోని వాకదారిపేట కేజీబీవీ కేంద్రాన్ని రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వైద్యశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ టి.కాంతారావు, పలు శాఖల అధికారులతో కలిసి కేంద్రంలోని పిల్లలు వినియోగించే టాయిలెట్స్, కిచెన్‌షెడ్, తరగతి గదులు, భోజనశాల ఇతర మౌలికవసతులను పరిశీలించారు. వసతిగృహంలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఆహార పదార్థాల తయారీ, విద్యార్థులకు హెల్త్ చెకప్ తదితర వాటి నిర్వహణపట్ల సిబ్బంది పలు సూచనలు చేశారు. కేంద్రంలో ఎటువంటి ఇబ్బంది వచ్చినా విద్యార్థులు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహాల ఆకస్మిక తనిఖీ

కోటనందూరు: భీమవరపుకోటలో బీసీ బాలురు, టిమ్మరాజుపేటలో బీసీ బాలికల, అల్లిపూడి కేజీబీవీ వసతిగృహాలను ఎంపీడీఓ వెంకటనారాయణ ఆధ్వర్యంలో అధికారుల బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. విద్యార్థుల వసతి సదుపాయాలు, భవనాల స్థితిగతులు, వంటశాలల పరిశుభ్రత, తాగునీటి సదుపాయం పరిశీలించి నిర్వహణపై సిబ్బందిని ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి అందిస్తున్న భోజనం, ఇతర సౌకర్యాలపై వివరాలు సేకరించారు. వసతిగృహాల రికార్డులు, పరసరాలు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. హాస్టళ్లలో వాస్తవ పరిస్థితులను నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు బృంద కన్వీనర్, ఎంపీడీఓ నారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సత్యన్నారాయణ, ఎంఈఓ రామశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి

- 'సాక్షి'కి సంఘీభావంగా ప్రజాసంఘాలు, జర్నలిస్టుల ఆందోళన
- పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని మండిపాటు
- తప్పుడు కేసులు కొట్టివేయాలని డిమాండ్



ఏలేశ్వరం: కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న నకిలీ మద్యంపై యథాతథంగా కథనాలు ప్రచురించడం తప్పా? నిజాలు రాస్తే గొంతు నొక్కేస్తారా? అక్రమాలను ప్రజలకు చేరవేసినందుకు సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిని గత కొన్ని రోజులుగా వేధిస్తున్నారు. ఇది ముమ్మాటికీ స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే. నకిలీ మద్యంపై వరుస కథనాలు ప్రచురించి నిజాన్ని బట్టబయలు చేసిన 'సాక్షి' దినపత్రికపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు నిరసనగా పట్టణంలో శుక్రవారం ప్రజాసంఘాలు, జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, సీపీఎం, సీఐటీయూ, జర్నలిస్టులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవినీతిపై నిర్భయంగా వార్తలు రాస్తున్న 'సాక్షి' దినపత్రికపై వేధింపులకు దిగడం దారుణమన్నారు. నకిలీ మద్యంపై కథనాలు ప్రచురిస్తున్న 'సాక్షి'పై అర్ధరాత్రి వరకు విచారణ పేరుతో వేధించడం తగదన్నారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు 'సాక్షి' విలేకరులపై కేసులు నమోదు చేయడాన్ని వెంటనే విరమించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. అనంతరం తహసీల్దార్ కుశరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లిబరేషన్ జిల్లాకార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, సీఐటీయూ మండల నాయకుడు పిల్లా రాంబాబు, పైల విజయ్‌కుమార్, కావలి శ్రీనివాసరావు, జర్నలిస్టులు కోరాడ శ్రీనివాసరావు, ఎండీ అధికారి, మల్లిఖార్జునరావు, దాసరి కృష్ణ, దొంతంశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

జగ్గంపేట: పత్రికా స్వేచ్ఛను అరిస్తూ, పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం, పత్రిక ఎడిటర్, బ్యూరో చీఫ్‌లపై కేసులు నమోదు చేసి పోలీసులు బెదిరించడాన్ని నిరసిస్తూ శుక్రవారం జగ్గంపేటలో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పత్రికల గొంతు నొక్కాలని చూస్తున్న పోలీసుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలో 'సాక్షి' పత్రికా కార్యాలయంలో పోలిసు చొరబడి జర్నలిస్టులపై కేసులో నమోదు చేయడాన్ని తప్పుపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల తహసీల్దార్ జెవిఆర్ రమేష్‌కు అందచేశారు. జగ్గంపేట, గండేపల్లి , కిర్లంపూడి 'సాక్షి' రిపోర్టర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగ్గంపేట, గండేపల్లి మండలాలకు చెందిన పలువురు జర్నలిస్టు సంఘాలకు చెందిన నేతలు ఎస్టీవి సూరిబాబు, ప్రభ బాబులు, నేటి కార్యకర్త వీరబాబు, వార్త రాంబాబు, మహాన్యూస్ సతీష్, ఐన్యూస్ శివ, మా టీవి కృష్ణ, జీ తెలుగు మణికంఠ, 10టీవీ వీరబాబు, వేటూ న్యూస్ రామకృష్ణ, విశాలాంధ్ర సతీష్, వివిధ లోకల్ పత్రికల రిపోర్టర్‌లు సుంకర శ్రీను, విజయ, శ్రీనివాస్, చైతన్య పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాలు, జర్నలిస్టులు



జగ్గంపేట తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు



జగ్గంపేటలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పేదల రక్తాన్ని పీల్చేందుకే ప్రైవేటీకరణ

తొండంగి: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సంపద సృష్టిస్తానంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పాటు వివిధ అన్ని రంగాల్లోనూ ప్రైవేటీకరణతో ప్రజలను నట్టేట ముంచేందుకు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల ప్రజాఉద్యమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని శుక్రవారం తొండంగి మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కనీస అవసరాలైన విద్య, వైద్య రంగాల్లో పీపీపీ పద్ధతి (పబ్లిక్ ప్రైవేట్ పాలసీ) అంటూ అన్నింటిని ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. దీని వల్ల సామాన్య, పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు తప్పవన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో పక్షపాత ధోరణితో అర్హులైన లబ్ధిదారులకు కూడా అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో ఎటువంటి వివక్ష చూపకుండా అన్ని సంక్షేమపథకాలను అందించారన్నారు. యోగా డే, పర్యటనల పేరుతో కోట్లాది రూపాయల ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. అనతికాలంలోనే లక్షల కోట్లాదిరూపాయలు అప్పులు చేసి ప్రజలపై భారాన్ని మోపి నట్టేట ముంచేందుకు పాలన సాగుతుందన్నారు. చంద్రబాబు తీరు మార్చుకోకుంటే భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, రావికంపాడు వైఎస్సార్ సీపీ నాయకులు, కోడూరి దివాణం, సిద్ధా శ్రీనివాసరావు, కురిమెళ్ల రాంబాబు, అరిగెల శేషు, మేడిశెట్టి ఫణీంద్ర, సిద్ధా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటీకరణపై రావికంపాడు గ్రామస్తుల నుంచి సంతకాల సేకరిస్తున్న దాడిశెట్టి రాజా

'కోటి సంతకాలతో' నీలదీస్తాం

తుని రూరల్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ఇవ్వాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపుతో తుని మండలం లోవకొత్తూరు, ఎస్.అన్నవరం గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆదేశాలతో ఎస్సీ సెల్ నాయకుడు లంక కృపానందరం ఆధ్వర్యంలో కొత్త వెలంపేట, సీత్యపేట గ్రామాల్లో సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్.అన్నవరంలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించి సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచ్ గొర్ల ఆదినారాయణ, యూత్ సెక్రటరీ బసనబోయిన లోవరాజు, తణ్రా శ్రీధర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వడ్లమూరి రాజు పాల్గొన్నారు.



లోవకొత్తూరులో సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రైతు విభాగం సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్వరరావు

గోకవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులైన గోకవరానికి చెందిన సీనియర్ నాయకుడు దాసరి వెంకటేశ్వరరావుని పార్టీ నాయకులు శుక్రవారం అభినందించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులు కావడం పట్ల పార్టీ సీనియర్ నాయకుడు సుంకర వెంకటరమణ, ఎంపీపీ, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ జాయింట్ సెక్రటరీ సుంకర శ్రీవల్లీ వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి తోలేటి రాంప్రసాద్, విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు కోసిన అరుణ్ కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు బొర్రా శేఖర్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నండూరి బుజ్జిలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.



దాసరి వెంకటేశ్వరరావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీహెచ్‌సీలో అధికారుల తనిఖీలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ని జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ సీహెచ్ చలమయ్య బృందం శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ నిర్వహించింది. సీహెచ్‌సీలోని లింక్ ఏఆర్టీ సెంటర్‌లో క్షుణంగా తనిఖీలు చేపట్టారు. అక్టోబర్ నెలలో 1,015 మంది ఏఆర్టీ మందులు తీసుకున్నట్లు గుర్తించారు. ఐసీటీసీ ల్యాబ్, ఆర్ఎన్‌టీసీపిలో రోజు వారీ ఎన్ని పరీక్షలు జరుగుతున్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గత నెలలో 763 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా నలుగురికి పాజిటివ్ ఉందని వారు గుర్తించారు. టీబీ రోగులు ఎంత మంది ఉన్నారు. వారు సక్రమంగా మందులు వాడుతున్నారా ఆరా తీశారు. సీహెచ్‌సీలో సిబ్బంది పనితీరు, పరిసరాల పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం లింక్ ఏఆర్టీ సెంటర్‌ను ఏఆర్టీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని చలమయ్య హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్యమైఖేల్ సిబ్బంది తదితరులున్నారు.



సీహెచ్‌సీలో లింక్ ఏఆర్టీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ చలమయ్య

ఉద్యానశాఖ రాయితీలను సద్వినియోగం చేసుకోండి



బలభద్రపురంలో బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న అధికారులు



రైతు సేవాకేంద్రంలో అందుబాటులో ఉంచిన ఆర్డీఎస్ కిట్లు

జగ్గంపేట: మామిడి, జీడి మామిడి, కూరగాయల సాగు రైతులు సరైన యాజమన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు, నాణ్యమైన పంటను తక్కువ ఖర్చుతో పొందవచ్చని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎన్.వి.రఘునందన్ పేర్కొన్నారు. గుర్రంపాలెం, బలభద్రపురం గ్రామాల్లో ఉద్యానశాఖ అధికారిణి ఎ.శ్రీవల్లి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన రైతులకు మామిడిలో తేనమంచు పురుగు, పండు ఈగ, భూజు, పక్షి కన్ను తెగులు వివిధ పూత దశలలో చేపట్టవలసిన నివారణ చర్యలను వివరించారు. ఉద్యానశాఖ అధికారిణి శ్రీవల్లి రైతులకు రాయితీలపై ఇస్తున్న పరికరాలు, విత్తనాలు తదితర వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో మెట్టభూముల్లో సాగుచేసే ఉద్యానవన పంటల్లో అంతరసాగు చేపట్టేందుకుగాను ఆర్డీఎస్ కిట్లు(రబీ డ్రై సోయింగ్ కిట్లు)ను ఉపయోగించుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద ఆర్డీఎస్ కిట్లు తయారు చేసి రైతులకు అందుబాటులో ఉంచారు. ఆసక్తిగల రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం జీవన ఎరువులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పెద్దాపురం ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఎ.సీతారామశర్మ విచ్చేశారు. పచ్చిరొట్ట ఎరువులు (జనుము, జీలుగ, పిల్లి పెసర, అలసంద) అజోస్పిరిల్లం, ఫాస్ఫో బాక్టీరియా, పొటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియా వల్ల ఉపయోగాలు, వాటిని వినియోగించే తీరు, ఆవశ్యతను విశదీకరించారు. వ్యవసాయశాఖ ద్వారా ప్రస్తుతం అమలవుతున్న పథకాలపై మండల వ్యవసాయాశాఖాధికారి జోకా అమృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కోటనందూరు: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. అల్లిపూడిలో శుక్రవారం ప్రజదర్బార్ నిర్వహించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే తక్షణమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అల్లిపూడి గ్రామా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. గ్రామంలో ఇప్పటికే రూ.65 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేశామని, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పంచాయతి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తుని: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ నార్ల భువనసుందరి అన్నారు. స్థానిక రాజా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్‌లను శుక్రవారం ఆమె ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ క్రీడాకారులు పరిచయం చేసుకొని అభినందనలు తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో 40 మంది క్రీడాకారులకు కబడ్డీ, కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గీతాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నూతన టెక్నాలజీపై అవగాహన కల్పించినట్టు చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. లాట్ సొల్యూషన్ డిజైన్ హేండ్స్ ఆన్ విత్ ఈఎస్‌పీ32 అండ్ క్లౌడ్ ఎకోసిస్టమ్స్ అనే అంశంపై ఐదు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ భూషణ్ సామ్యూల్ నీలం, సీఎస్‌సీ విభాగాధిపతి డివి మంజుల, డైరెక్టర్ ఎంవి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడమిక్స్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జి.నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

గోకవరం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ట్రైనీ ఎస్సై నాగమణి ఆధ్వర్యంలో దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.17 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

మైమరపించిన యమలోకం వీధినాటకం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీశంకరుల 89వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక కళాకారులు ప్రదర్శించిన యమలోకం వీధి నాటకం స్థానికులను మైమరిపించింది. శుక్రవారం స్థానిక కళాకారుల ఆధ్వర్యంలో నాటకాన్ని గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు తదితర సెంటర్లలో ప్రదర్శించారు.

నిందితుడిని అరెస్టు చేయాలి



తునిలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

తుని: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శ్యాంకుమార్ డిమాండు చేశారు. తునిలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నిందితుడు రాకేష్‌కిషోర్ ఉద్దేశ పూర్వకంగానే గవాయ్‌పై దాడికి యత్నించాడని ఆరోపించారు. ఈ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సిట్టింగు జడ్జితో విచారణ జరిపించి నిందితుడిని శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

పునరావృతం కాకుండా శిక్షించాలి

గోకవరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు శుక్రవారం గోకవరంలో నిరసన చేపట్టారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ రామకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఇటువంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరి వనదుర్గ అమ్మవారికి శుక్రవారం పర్వదినం సందర్భంగా చండీ హోమాన్ని నిర్వహించారు. హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత అమ్మవారికి వేదపండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

గండేపల్లి: వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి పోలీసులు తెలిపారు. మండలంలోని మురారి గ్రామానికి చెందిన వాలిన బూషణరావు (59) ఉప్పలపాడులో పాలచర్ల ప్రసాద్‌కు చెందిన పామాయిల్ తోటలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. శుక్రవారం మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేయగా సంఘటనాస్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రిపోర్టును బట్టి కేసు నమోదుచేయనున్నట్టు వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు ముదునూరి భరోసా



పోతులూరులో ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న మురళీ కృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు వివిధ కారణాలతో అనారోగ్యానికి గురయ్యారు. నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు శుక్రవారం వారిని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక భరోసా కల్పించారు. గ్రామానికి చెందిన కుట్టుమూరి చంటియ్య, సాగరపు సత్తిబాబు అనారోగ్యంతో బాధపడుతున్నారు. మురళీకృష్ణంరాజు వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒక్కో కుటంబానికి రూ.5 వేలు చొప్పున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సర్పంచ్ బొండి రాంబాబు, శెట్టి సత్తిబాబు, చెక్కపల్లి నాగేశ్వరరావు, బాబ్జి, చెక్కపల్లి బుజ్జిబాబు, కోలా తాతబాబు, నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి

రౌతులపూడి: మండలంలోని మహిళా సంఘాల (స్వయం సహాయక సంఘాలు) ఆన్‌లైన్ నమోదు (బుక్‌కీపింగ్)ను త్వరితగతిన పూర్తిచేయాలని ఏపీఎం త్రినాధమ్మ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల వీఓఏలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని 43 వీఓల్లోను 1,351 స్వయం సహాయక సంఘాలుండగా వీటిలో ఈ నెల ఇప్పటి వరకు 659 సంఘాలను మాత్రమే ఆన్‌లైన్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని స్త్రీనిధి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, సీఐఎఫ్, హెచ్‌డీఐఫ్, బ్యాంకు లింకేజి రుణాలను ఎప్పటికప్పుడు సక్రమంగా చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీసీలు నాగమణి, రతన్‌రాజు పలవురు వీవీఏలు పాల్గొన్నారు.



రౌతులపూడి వెలుగు కార్యాలయంలో వీఓఏలతో సమీక్షిస్తున్న ఏపీఎం త్రినాథమ్మ

ప్రతిభకు లేదు వయస్సు

రౌతులపూడి: మండల కేంద్రం రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన దార్లపూడి వర్ష రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు తెలిపారు. శుక్రవారం కాకినాడలో జరిగిన 'క్వాంటం ఏజ్ బిగిన్స్–పొటెన్షియల్ అండ్ ఛాలంజ్' అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో వర్ష ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. శనివారం విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో వర్ష పాల్గొనున్నట్లు ఆయన విలేకర్లుకు తెలిపారు. ఆ మేరకు విద్యార్థినికి పాఠశాల ప్రధనోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, ఎంఈఓలు సతీష్‌బాబు, గాడి కొండబాబులు, అభినందనలు తెలిపారు.



దార్లపూడి వర్ష

ఆన్‌లైన్ పరిచయాలకు లోనుకావద్దు

ప్రత్తిపాడు రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని స్థానిక ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం అన్నారు. మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు. ఉత్తమ విద్యను అభ్యసించి సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపును తెచ్చుకోవాలన్నారు. సోషల్ మీడియాలో పరిచయాలు, ఆన్లైన్ వేధింపులు, ప్రేమ పేరుతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. పోలీసు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

గోకవరం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ వైవిఎస్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకవరంలోని తంటికొండ ఫీడర్, ఫోక్స్‌పేట ఫీడర్లలో మరమ్మతులు, స్తంభాలపై ఒరిగిన చెట్టు కొమ్మలు తొలగిస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కృష్ణునిపాలెం, కొత్తూరు, వెంకటాపురం, రామన్నపాలెం, చిన్నూరు, రామానుజపురం తంటికొండ వ్యవసాయ ఫీడర్ పైన ఉన్న వ్యవసాయ సర్వీసులుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.